



తర్నికల్ సమీపంలో రోడ్డుపై పారుతున్న వరద నీటి అంతరాయాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ వాగు

వర్ష బీభత్సం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రెండవ రోజూ వర్షం బీభత్సం సృష్టించింది. చెరువులు అలుగు పారగా, వాగులు ఉప్పొంగాయి. చాలా చోట్ల రోడ్లు తెగడంతో పాటు.. రహదారులపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వరదల్లో చిక్కుకుపోయిన వారిని అధికారులు పుట్టీల ద్వారా సురక్షితంగా బయటికి తెచ్చారు. వనపర్తి జిల్లా మదనాపురంలోని ఆసియా ఖండంలోనే మొట్ట మొదటి ఆటోమెటిక్ సైఫన్ సిస్టమ్ ద్వారా సరళాసాగర్ గేట్లు తెరచుకున్నాయి. జూరాల ప్రాజెక్టు, సంగంబండ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల కొనసాగింది. మహబూబ్‌నగర్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- నిండిన చెరువులు, తెగిన రహదారులు
- అన్ని జిల్లాల్లో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం ఎక్కమేడులో గోడ కూలి మృతి చెందిన తల్లీ కూతుళ్లు
- వరదలో చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడిన అధికారులు, స్థానికులు
- మదనాపూర్ వద్ద తెరుచుకున్న సరళా సాగర్ సైఫన్ గేట్లు

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్/ నారాయణపేట /గద్వాల/ రాజోలి/వనపర్తి అర్బన్, సెప్టెంబరు 1: భారీ వర్షాలకు ఉమ్మడి పాలమూరు జిల్లా అతలాకుతలమైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎటు చూసినా చెరువులు అలుగు పారుతుండగా, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పాలమూరు పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన జగ్జీవన్‌రామ్ నగర్, లక్ష్మీనగర్ కాలనీ, గణేష్‌నగర్, రామయ్యబౌళి, గోల్‌మసీద్ ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి నీరు చేరింది. పట్టణంలోని ప్రముఖ ఎల్లమ్మ ఆలయం గర్భగుడి మినహా ఆలయాన్ని వరద నీరు ముంచెత్తింది. వరద ప్రాంతాలలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్‌లు పర్యటించారు. హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ వద్ద జాతీయ రహదారి 167ఎన్ బ్రిడ్జి పనులు సాగుతుండగా, సర్వీస్ రోడ్డు తెగిపోయి, రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో హన్వాడ మీదుగా వెళ్ళే మహబూబ్‌నగర్- కొడంగల్ వాహనాలను కోయిలకొండ మీదుగా దారి మళ్లించారు. కోయిలకొండ మండలంలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గార్లపహాడ్, మల్కాపూర్, ఆచార్యపూర్ వంతెనలపై రాకపోకలు నిలిపేశారు. ఆయా గ్రామాల ప్రజలు ఊళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. నవాబ్‌పేట మండలంలో తాళ్ళవాగు వంతెనపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. నవాబ్‌పేట మండలం కారూర్-మల్లారెడ్డిపల్లి రహదారికి గండి పడటంతో రాకపోకలను ఆపేశారు. జడ్చర్ల మండలం గోప్లాపూర్-లింగంపేట వెళ్ళే దారిలో గంజివాగు వంతెనపై నుంచి ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. చిన్నచింతకుంట మండలం సబ్‌స్టేషన్‌లోకి భారీగా వరదనీరు చేరడంతో సబ్ స్టేషన్‌ను బంద్‌చేశారు. దీంతో మండలంలోని వడ్డేమాన్, దమగ్నాపూర్, నెల్కొండి, సీతారాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక జిల్లాలోని పలు మండలాల్లో వందల ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. చేతికందిన జొన్నపంట నేలకొరిగింది. వర్షాలు ఇలానే కురిస్తే జొన్నకంకులు నల్లగామారి రైతులు నష్టపోవాల్సి వస్తుంది.

జలదిగ్బంధం

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా రెండో రోజు ఆదివారం కురిసిన వర్షాలకు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి, జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. జిల్లా వ్యాప్తంగా చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. రోడ్లపై పారుతున్న పలు వాగుల వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో పత్తి, కంది, వరి పంటలు నీటమునిగాయి. కొత్తపల్లి మండలం ఎక్కమేడులో ఇంటిగోడ కూలి తల్లీ కూతుళ్లు హన్మమ్మ(60), అంజలమ్మ(40) చనిపోయారు. ఊట్కూర్ పెద్ద చెరువు అలుగు పారడంతో మక్తల్-ఊట్కూర్-నారాయణపేట మధ్య రాకపోకలు స్తంభించాయి. కొండారెడ్డిపల్లి చెరువు అలుగు పారడంతో పళ్ల వాగుకు నీటి ప్రవాహం ప్రారంభమైంది. భూనేడ్-అభంగాపూర్ మధ్య వాగు ఉధృతి తగ్గకపోవడంతో కోటకొండ నుంచి అభంగాపూర్, బండగొండ, భూనేడ్, కొత్తపల్లి తదితర గ్రామాల రాకపోకలకు అంతారాయం ఏర్పడింది. పాతపల్లి నుంచి ధన్వాడకు వెళ్లే రహదారిలో పాతపల్లి వాగు ఉధృతితో రాకపోకలు స్తంభించాయి. మక్తల్ మండలం కర్ని చెరువు అలుగుపారి అనుగొండ రహదారిపై నీళ్లు పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంగంబండ నుంచి నేరేడుగం వెళ్లే రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున కల్వర్టును అదనపు కలెక్టర్ అశోక్, ఆర్డీవో, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి పరిశీలించారు.

నిలిచిన రాకపోకలు

జోగుళాంబ గద్వాల జిల్లాలో వాగులు ఉధృతంగా పారుతున్నాయి. దాంతో పలు గ్రామాలకు రాకపోకలపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఎర్రవల్లి మండలం షేక్‌పల్లి, సాతనూరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. పల్లెపాడు వాగు పొంగడంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ధరూరు మండలం నీలహళ్లి-పాతపాలెం మధ్య ఉన్న వాగు ఉప్పొంగడంతో తాత్కాక మట్టి రోడ్డు కోటుకుపోయింది. మానవపాడు మండలం చెన్నిపాడు-బొంకూరు గ్రామాల మధ్య ఉన్న వాగు, మానవపాడు-అమరవాయి మధ్య ఉన్న వాగు పొంగి పొర్లడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గద్వాల మండలం బీరెల్లి, రేకులపల్లితో పాటు జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. జమ్మిచేడు జమ్ములమ్మ స్టేజీ వద్ద ఏళ్ల నాటి రావి చెట్టు నెలకొరిగింది. రాజోలి మండల కేంద్రం శివారులోని సుంకేసుల జలాశయం వద్ద కోతకు గురైన కరకట్టను ఆదివారం ఎమ్మెల్యే విజయుడు పరిశీలించారు. అధికారులతో మాట్లాడి మట్టిని తెప్పించి, కట్టకు మరమ్మతులు చేయించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు మరమ్మతు పనులను పరిశీలించారు.

కూలిన 83 ఇళ్లు

భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 83 ఇళ్లు నేల కూలాయి. పలు చోట్ల గోడలు కూలాయి. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వెంకటేష్ ఇంటి పైకప్పు కూలింది. ముండ్లదిన్నెలో ఒకటి, పెద్ద తాండ్రపాడులో ఒకటి ఇళ్లు కూలాయి. వడ్డేపల్లి మునిపాలిటీలోని ఆరవ వార్డులో కుర్వ నాగన్నకు, ఇటిక్యాల మండం షాబాద గ్రామంలో వెంకటయ్య శెట్టి ఇళ్ల గోడలు కూలిపోయాయి. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం మందిపల్లిలో నాగమ్మ, కొల్పూరులో బంగి అంజప్ప, మాగనూరులో దండురాజ్ ఇళ్లు కూలాయి. ఊట్కూర్ మండల కేంద్రంలోని మెయిన్ బజార్‌లో గల మెస్త్రీ లక్ష్మణ్ ఇల్లు, మగ్దుంపూర్ చౌరాస్తాలోని రఫీ చాంద్, గద్వాల్‌గేరికి చెందిన రఫీ, చిన్నపొర్లలో ఎర్గట్‌పల్లి చాంద్‌పాషా, ఎర్గట్‌పల్లి అన్వర్, గుపన్ హన్మంతు, గుపన్ అంజప్ప ఇళ్లు కూలిపోయాయి. మగ్దుంపూర్ గ్రామానికి చెందిన గురునాథ్, బిజ్వార్ కిష్టమ్మ, నర్సిములు, రాజుల ఇళ్లు, నిడుగుర్తి గ్రామానికి చెందిన ఖుర్షీద్ ఇంటి గోడ కూలాయి. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండలో గౌస్, మండలంలోని జూపల్లిలో అంకిళ్ల మైసమ్మ, అంకిళ్ల రాములమ్మ, జంతుక బాలస్వామి, జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో ఖలీల్ రహమాన్ ఇళ్లు కూలిపోయాయి. అమ్రాబాద్ మండలంలో 11 మట్టి మిద్దెలు నేల కూలాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మూడు నవాబ్‌పేట మండలంలో మూడు ఇళ్లు కూలిపోగా, వనపర్తి జిల్లాలో 45 ఇళ్లు నేలమట్టమయ్యాయి.

స్తంభించిన జన జీవనం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షం నాగర్‌కర్నూల్ జిల్లాను అతలాకుతలం చేసింది. జన జీవనం స్తంభించింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. బిజినేపల్లి మండలం లట్టుపల్లి గ్రామ సమీపంలో కేఎల్ఐ కాలువ తెగిపోవడంతో 300 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. తాడూరు మండలంలో దుందుభీ నది ఉధృతంగా పారుతోంది. లోలెవల్ కాజ్‌వేలపై వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో సిర్సవాడ, పాపగల్ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుఉన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ ఇరువైపులా ఘాట్ రోడ్డుపై కొండ చెరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారిపై పడిన మట్టి, పెద్దపెద్ద కొండ రాళ్లను స్థానిక పోలీసులు, ఎన్‌హెచ్ఏ అధికారులు, స్థానికుల సహకారంతో ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

రేవల్లిలో 122.5 మిల్లీ మీటర్ల వర్షపాతం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం కూడా భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో 122.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. నారాయణపేట జిల్లాలో అత్యధికంగా కోస్గి మండలంలో 122.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా క్రిష్ణ మండలంలో 40.6 మిల్లీ మీటర్లు నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ధరూరు మండలంలో అత్యధికంగా 5.85 సెంటీ మీటర్లు, అయిజ అత్యల్పంగా 2.85 సెంటీ మీటర్లు, వనపర్తి జిల్లాలో రేవల్లి మండలంలో అత్యధికంగా 122.5 మిల్లీ మీటర్లు, చిన్నంబావిలో అత్యల్పంగా 74, మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్‌లో అత్యధికంగా 123, కోయిలకొండలో అత్యల్పంగా 58.9, నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా బిజినేపల్లిలో 64, అత్యల్పంగా పదర మండలంలో 15.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

రెడ్ జోన్‌లో వనపర్తి

భారీ వర్షాలతో వనపర్తి జిల్లాను రెడ్ జోన్‌గా ప్రకటించారు. దాంతో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రమాదకరంగా ఉన్న చెరువుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు, రోడ్లపై నీటి ప్రవాహం ఉన్న చోట రాకపోకలు సాగించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మదనాపూర్ మండలం ఊకచెట్టు వాగు వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండేళ్ల క్రితం జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకొని అధికారులు అటువైపు ఎవరినీ వెళ్లనివ్వడం లేదు. దాంతో వనపర్తి నుంచి ఆత్మకూరుకు వెళ్లే వారు రామన్‌పాడు మీదుగా వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. వనపర్తి నుంచి పెద్దమందడికి వెళ్లే రోడ్డులో అల్వాల పెద్ద వాగు కూడా పొంగిపొర్లడంతో ఆ రోడ్డుపై రాకపోకలను నిలిపేశారు. పెబ్బేరు నుంచి వెంకటాపూర్‌కు వెళ్లే రహదారి రోడ్డు భారీ వర్షానికి కోతకు గురైంది.

జూరాల 45 గేట్లు ఎత్తివేత

» మదనాపూర్‌లో తెరచుకున్న సరళా సాగర్ సైఫన్ సిస్టమ్



కోయిల్‌సాగర్ నుంచి విడుదలవుతున్న నీరు

ధరూరు/మదనాపురం/మక్తల్ రూరల్/మహబూబ్‌నగర్: ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి వరద వస్తుండటంతో జోగుళాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు 45 గేట్లను ఆదివారం ఎత్తి నీటిని విడదల చేస్తున్నారు. 3,88,683 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి వదులుతున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జలాశయంలో 317.899 మీటర్ల వద్ద(8.415 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 17,964 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, నాలుగు యూనిట్ల ద్వారా 134 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

తెరుచుకున్న సైఫన్ సిస్టమ్

ఆసియా ఖండంలోనే మొట్టమొదటి ఆటోమెటిక్ సైఫన్ సిస్టం గల మదనాపురం మండలం సరళా సాగర్ ప్రాజెక్టు గేట్లు ఆదివారం తెరుచుకున్నాయి. 48 గంటలుగా కురుస్తున్న భారీ వర్షాలకు భారీగా వరద నీరు చేరుకోవడంతో ఆటోమెటిన్‌గా గేట్లు ఓపెన్ అయ్యి నీరు దిగువకు వెళ్తోంది.

సంగంబండ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

కర్ణాటక నుంచి వరద రావడంతో మక్తల్ మండలంలోని సంగంబండ రిజర్వాయర్ ఐదు గేట్లను ఎత్తి, నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.317 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌లోకి ఎనిమిది వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, పది వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఏఈ హమీద్ తెలిపారు.

కోయిల్‌సాగర్ గేట్ల ఎత్తివేత

తీవ్ర వరద కారణంగా మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌సాగర్ మొత్తం 13 గేట్లు తెరిచి, దిగువకు 25 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. మూడు గంటల తరువాత వరద ఉధృతి కాస్త తగ్గడంతో నాలుగు గేట్లు బంద్ చేశారు.

రాత్రంతా అడవిలోనే పశువుల కాపరులు



చెన్నపురావుపల్లి శివారు వాగులో చిక్కుకున్న పశువుల కాపరిని ఒడ్డుకు తెచ్చిన పోలీసులు, అధికారులు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురాంపల్లి శివారులోని నక్కల వాగు మధ్య ఓ పశువుల కాపరి, అతని కుమారుడు, కుమార్తె చిక్కుకు పోయారు. అధికారులు పుట్టి సహాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. గ్రామానికి చెందిన పశువుల కాపరి వడ్డె రామస్వామి, కుమారుడు రామకృష్ణ, కుమార్తె రేణుక (ఇద్దరూ మూగవారు)లతో కలిసి శనివారం ఉదయం గ్రామ శివారులోని నక్కల వాగు అవతలి ఒడ్డునున్న తమ పశువుల పాకకు వెళ్లారు. సాయంత్రం వరకు పశువులను మేపి, పాకలో కట్టేశారు. ఆ తర్వాత ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధం కాగా, వాగులో వరద ఉధృతి పెరిగింది. దీంతో రామస్వామి కుటుంబీకులు అక్కడే చిక్కుకుపోయారు. రాత్రంతా అక్కడే ఉన్నారు. ఆదివారం ఉదయం అటువైపు వెళ్లిన గ్రామస్థులు వారిని చూసి, గ్రామస్థులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. ఎస్‌ఐ సతీష్, తహసీల్దార్ యూసుఫ్‌అలీ, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. సోమశిల గ్రామం నుంచి చేపల పుట్టిని తెప్పించి, రామస్వామితో పాటు కుమార్తె, కుమారుడిని ఒడ్డుకు చేర్చారు.

దుందుభీ నది మధ్య చిక్కుకున్న గొర్రెల కాపరులు

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని దుందుభీ నది మధ్య ఉన్న మొత్కెలగడ్డ ప్రాంతంలో ఇద్దరు గొర్రెల కాపరులు, గొర్రెలు చిక్కుకుపోగా, పుట్టి సాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. సిర్సవాడ గ్రామానికి చెందిన ఆంజనేయులు, చిన్న మల్లయ్యలు మేత కోసం 200 గొర్రెలతో దుందుభీ నది పరివాహక ప్రాంతమైన మొత్కులగడ్డ ప్రాంతానికి శనివారం తీసుకెళ్లారు. ఆదివారం నదిలో వరద ఉధృతి పెరగడంతో వారిద్దరూ గొర్రెలు సహా నది మధ్యలో చిక్కుకుపోయారు. కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పరిశీలించారు. తాళ్ల సహాయంతో కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో సోమశిల నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు. పుట్టి సాయంతో అవతలి ఒడ్డుకు తీసుకొచ్చారు.

వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన రెస్క్యూ టీమ్

నాగర్‌కర్నూల్(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాగనూలు చెరువు నీరు నాగనూలు రోడ్డు మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. నాగర్‌కర్నూల్‌కు చెందిన వెంకటస్వామి మధ్యాహ్నం నాగనూలు నుంచి సాయంత్రం జిల్లా కేంద్రానికి వస్తూ, నాగనూలు సమీపంలో వరదలో కొట్టుకుపోయాడు. అక్కడే ఉండి రాకపోకలను పర్యవేక్షిస్తున్న పోలీస్ రెస్క్యూ టీమ్ హెడ్‌కానిస్టేబుల్ తకీయొద్దీన్, కానిస్టేబుల్ రాములు తమ ప్రాణాలకు తెగించి బయటకు తీసుకొచ్చారు.

వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన గ్రామస్థులు

ఊట్కూర్: ఉధృతంగా ప్రవహిస్తున్న ఊట్కూర్ మండలం పగిడిమర్రి వాగులో గ్రామానికి వస్తూ శ్రీనివాస్‌రెడ్డి కొట్టుకుపోయాడు. ఒక చెట్టును పట్టుకుని వాగులో చిక్కుకున్న అతన్ని ఎంపీటీసీ జాఫర్, గ్రామస్థులు ఎక్స్‌కవేటర్‌తో కాపాడారు. ఎక్స్‌కవేటర్‌కు తాడు కట్టి, కుర్వ ఉషన్న వాగులో ఈత కొట్టుకుంటూ శ్రీనివాస్‌రెడ్డి వద్దకు వెళ్లి అందించాడు. తాడు సాయంతో అతన్ని కాపాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిని అభినందించారు.

చెట్టుకొమ్మను పట్టుకొని ప్రాణాలు దక్కించుకున్న వ్యక్తి

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి పెద్ద చెరువు అలుగు పారే వాగులో ఓ వ్యక్తి చేపల వేట కోసం దిగి కొట్టుకుపోయాడు. అదృష్టవశాత్తు వాగులోని ఓ చెట్టును పట్టుకొని ప్రాణాలు దక్కించుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన తిరుపతయ్య ఆదివారం సాయంకాలం చేపల వేటకు వెళ్లాడు. అందుకోసం వాగులో దిగిన ఆయన, నీటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. కొద్దిదూరం కొట్టుకుపోయాక వాగులోని చెట్టును పట్టుకొని ప్రాణాలు దక్కించుకున్నాడు. కొందరు స్థానికి అతడిని గమనించి తాడు సాయంతో వాగులో నుంచి బయటకు తీసుకొచ్చారు.



అమ్రాబాద్ మండలం తెలుగుపల్లి గ్రామానికి చెందిన జాల లోకేష్ మట్టి మిద్దె కూలిపోవడంతో నిరాశ్రయులైన కుటుంబ సభ్యులు



తర్నికల్ సమీపంలో కల్వర్టుపై పారుతున్న నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు



మహబూబ్‌నగర్ పట్టణంలోని రేణుక ఎల్లమ్మ గుడిలోకి చేరిన వాన నీరు



జడ్చర్ల మండలం పోలేపల్లిలో కూలిన ఇల్లు



నాగర్‌కర్నూల్ పట్టణంలో అలుగు పారుతున్న నాగనూలు చెరువు



కేసరి సముద్రంలో అలుగు పారడంతో చేపలు పడుతున్న యువకులు



జడ్చర్లలోని రంగనాయకస్వామి గుట్ట రహదారిపై కూలిన కొండచరియలు



రేవల్లి-తల్పునూరు గ్రామాల మధ్య కేఎల్ఐ క్నాల్వకు పడిన గండి



బల్మూరు మండలం కొండనాగుల వద్ద రోడ్డుపై విరిగి పడిన చెట్టు



ఘనంగా శ్రీపరశువేదీశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

జడ్చర్ల, సెప్టెంబరు 1 : జడ్చర్ల మండలంలోని కుర్వగడ్డపల్లి సమీపంలోని దుందుభీనది పరివాహక ప్రాంతంలో ఉన్న శ్రీపరశువేదీశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. దేవాలయంలో ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీపరుషవే దీశ్వర స్వామికి లక్షబిల్వాలతో అర్చన చేపట్టారు. సాయంత్రం స్వామి వారికి రుద్రాభిషేకం, శివ పార్వతుల కల్యాణాన్ని జరిపించారు. రాత్రి స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

పాలమూరు,సెప్టెంబరు 1: భారీ వర్షాలకు నష్ట పోయిన బాధితులను ఆదుకోవాలని సీపీయం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. శనివారం రాత్రి, ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అనేక కాలనీల్లో ఇళ్లలోని నీరు రావటంతో ఆహారధాన్యాలు తడిసిపోయి పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. నిరాశ్రయులను ఆదుకోవాలని కోరారు. ప్రజలకు ఆశ్రమ

డ్రంకెన్‌డ్రైవ్‌లో 45 మందికి జైలు..జరిమానా

- వివరాలను వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, సెప్టెంబరు 1: డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో 45మందికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ అలంపూర్ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లల్లో ఆగస్టులో పోలీస్ అధికారులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రవ్‌లో పట్టుబడ్డవారిని ఆదివారం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఇందులో అలంపూర్ స్టేషన్ పరిధిలో 13మంది, కోదండాపూర్ స్టేషన్ పరిధిలో-తొమ్మిదిమందికి, ఇటిక్యాల స్టేషన్ పరిధిలో -10 మందికి, ఉండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో -ఆరుగురు, మానవపాడు స్టేషన్ పరిధిలో -ఏడుగురికి మొత్తంగా 45 మందికి రెండు రోజుల నుంచి ఎనిమిది రోజుల వరకు జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 2000 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, అనుకోని ప్రమాదాలకు గురై కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు.

మోటార్ బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

గద్వాల క్రైం, సెప్టెంబరు 1: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన పట్టణంలోని రాజీవ్‌మార్గ్‌లో ఆదివారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి స్థానికల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణానికి చెందిన మురళీధర్ రెడ్డి ఒక బైక్‌పై, అలాగే రంజిత్, నరేష్ మరోబైక్‌పై ఎదురెదురుగా వస్తూ రెండు బైక్‌లు ఢీకొనగా ముగ్గురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.


వైభవంగా శ్రీకృష్ణుడి శోభాయాత్ర


కేటీదొడ్డిలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కేటిదొడ్డి, సెప్టెంబరు 1 : కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం మండల కేంద్రం కేటీదొడ్డితో పాటు కొండాపురం గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహ శోభాయాత్ర వైభవంగా సాగింది. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో కేటిదొడ్డి, కొండాపురం గ్రామాల్లో ప్రత్యేక వేదికలు ఏర్పాటుచేసి కృష్ణాష్టమి నాడు శ్రీకృష్ణుడి ప్రతిమలను ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటుసాగిన ప్రార్థన, నిత్య పూజలు, భగద్గీత శ్లోక పారాయణం అనంతరం స్వామివారి ఊరేగింపును వైభంగా చేప ట్టారు. ఉత్సవకమిటీ బాధ్యులు కృష్ణమూర్తి, ప్రసాద్, గిరి, వీరన్న, రాముడు ఉన్నారు.

పోలేపల్లిలో...

జడ్చర్ల, : జడ్చర్ల మండలంలోని పోలేపల్లిలో ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీకృష్ణభగవానుడిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.
















సర్వం కోల్పోతున్నాం..

- న్యాయమైన ప్యాకేజీ ఇవ్వండి!
- పరిహారం కోసం ముంపు గ్రామస్థుల ఎదురుచూపు
- 18ఏళ్లు నిండిన వారికి రూ.13లక్షలు, ప్రతీ కుటుంబానికి రూ.32లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- ఒక్కో కుటుంబానికి 300 గజాల స్థలంలో ఇల్లు నిర్మించాలని కోరుతున్న బాధితులు

జడ్చర్ల, సెప్టెంబరు 1 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో సర్వం కోల్పోతున్నామని, న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని ముంపు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 1.50లక్షల ఎకరాలకు సాగునీరు, పరోక్షంగా భూగర్భజలాలు పెరగడంతో పాటు తాగునీరు అందుతుండగా, భిన్నంగా తామంతా సర్వం కోల్పోతున్నామని ముంపువాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం ఇప్పటికే భూసేకరణ చేపట్టిన అధికారులు, పరిహారం అంశంలో అతి తక్కువ ప్యాకేజీ ఇచ్చారన్న భావనలో నిర్వాసితులు ఉన్నారు. ఇప్పటికే చేపట్టిన సామాజిక, ఆర్థిక, గణన లెక్కింపులోనైనా కొంత మేలైన పరిహారం అందుతుందేమోనని ఎదురుచూస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో ఉదండాపూర్, వల్లూరుతో పాటు రేగటిపట్టితండా, చిన్నగుట్టతండా, తుమ్మలకుంటతండా, ఒంటిగుడిసెతండా, నవాబ్‌పేట మండలంలోని శ్యామగడ్డతండా ముంపునకు గురవుతున్నాయి. ఈ గ్రామాల్లో అత్యధికంగా నిరుపేదలే ఉన్నారు. సామాజిక, ఆర్థిక గణన చేపట్టి రెండేళ్లు పూర్తయినా పరిహారం అందకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.


ముంపునకు గురవుతున్న ఉదండాపూర్ గ్రామం వ్యూ..


వల్లూరు గ్రామం వ్యూ..


రిలే నిరాహారదీక్షలో కూర్చున్న ముంపు గ్రామస్తులు (ఫైల్)

ప్రతీ కుటుంబానికి రూ.32లక్షలు..

ప్రతి కుటుంబానికి రూ.16,30,200, పరిహారం చెల్లించే నాటికి 18 ఏళ్లు నిండిన వారికి రూ.6.50లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కుటుంబానికి రూ.32లక్షలు, 18ఏళ్లు నిండిన వారికి రూ.13లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఖాళీ స్థలాలకు ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకుని గజానికి రూ.10వేల చొప్పున ఇప్పించాలని కోరుతున్నారు.

300 గజాల స్థలంలో ఇళ్లు

ముంపు గ్రామస్తులకు పునరావాసం కల్పించే అంశంలో భాగంగా ఇస్తామన్న 300 గజాల స్థలంలో ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పునరావాసం కల్పించే అంశంలో ఇప్పటికీ నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని, ఇప్పటి వరకు స్థలాల పట్టాలు ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. జీవనోపాధి కోసం కుటుంబానికి ఎకరా భూమి, లేదంటే ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని చెబుతున్నారు.

పట్టపగలే వ్యక్తి దారుణ హత్య


సంజన్న(ఫైల్)

ఎర్రవల్లి, సెప్టెంబర్ 1: వ్యక్తిని అతి కిరాతకంగా నరికి, బండ రాళ్లతో కొట్టి హత్య చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని సాసనూల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం.. సాసనూల్ చెందిన సంజన్న (48) కౌలుకు తీసుకున్న పొలం ఉదయం 11 గంటల ప్రాంతంలో నుంచి వెళ్లాడు. అంతలోనే తన పొలానికి సమీపంలో విగతాజీవిగా పడి ఉండడంతో కలకలం రేపింది. గుర్తు తెలియని దుండగులు గ్రామ శివారులోని చెరుకుతోట వద్ద పదునైన ఆయుధాలతో దాడి చేసి చంపినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టపగలే దారుణ హత్యకు ఒడిగట్టడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హత్యకు గల వివరాలు తెలియరాలేదని పోలీసులు చెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న జాగిలాలు పరిశీలించినా ఆచూకీ లభించలేదు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవి బాబు, ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ పరిశీలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆగారం చెరువు వద్ద రైతుల గొడవ


ఆగారం చెరువు కట్టపై మట్టిని సరి చేయిస్తున్న రైతులు

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 01: మండలంలోని ఆగారం చెరువులో వర్షపు నీరు నిలపొద్దని ఓ వర్గం, ఉండాలని మరో వర్గం ఆదివారం గొడవకు దిగారు. ఆగారం రెడ్లకుంట చెరువులో ఖిల్లాఘణపురం చెందిన రైతులకు భూములు ఉండడంతో వరి నాట్లు వేశారు. చెరువులోని నీరు బయటకు వెళ్లకుండా ఆగారం రైతులు గతంలో ఉన్న కట్టను సరిచేస్తూ మట్టి వేశారు. దీంతో వరి పంట మునిగిపోతుందని ఖిల్లాఘణపురం రైతులు మట్టిని తొలగించారు. చెరువులో నీరు వృథాగా పోయేలా కట్టను తొలగించారని ఆగారం రైతులు, ఖిల్లాఘణపురం రైతులతో వాదనకు దిగారు. ఇరు వర్గాలు గొడవకు దిగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఎస్ఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో చెరువులోని నీరు కిందకు వెళ్లకుండా కట్టపై మట్టివేసి సరి చేశారు. అనంతరం చెరువు తూము నుంచి నీరు కిందకు వెళ్లే విధంగా పొక్లెయిన్ సాయంతో కాల్వను సరిచేసి ఇరు గ్రామాల రైతులకు సముదాయించారు. అనంతరం ఆగారం చెరువు కట్టను తహసీల్దార్ పాండు పరిశీలించి నీరు వృథా చేయొద్దని సూచించారు. చెరువులో ఉన్న 40 ఎకరాల పంట కోసం చెరువు కింద 500 ఎకరాల పొలాల రైతులకు అన్యాయం చేయొద్దని రైతులకు సూచించారు. ఆగారం రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

దేవాలయంలో మైక్ సెట్ చోరీ


ఆంజనేయ స్వామి ఆలయం

ఖిల్లాఘణపురం,సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని బజారు అంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మైక్ సెట్ ఎత్తుకెళ్లారు. తాళాలు పగులగొట్టి గర్భగుడి అల్మారాలో ఉన్న మైక్ సెట్‌ను ఎత్తుకెళ్లినట్లు అలయ కమిటీ సభ్యుడు పాలవాది రాజు తెలిపారు. గతంలో మండల కేంద్రం శివారులోని పర్వతాపూర్ రోడ్డుపై గల దేవాలయంలో చోరీకి పాల్పడిన ఘటనలు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ నరేష్ కుమార్‌ను వివరణ కోరగా.. సమాచారం రావడంతో సిబ్బంది వెళ్లి దేవాలయంలో పరిశీలించారని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అలంపూర్ ఎస్సై నాగరాజుపై చర్యలు

- వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు


నాగరాజు, ఎస్ఐ

గద్వాల క్రైం, సెప్టెంబరు 1 : ఓ మహిళతో వివాహేతర సంబంధం, మరో కానిస్టేబుల్ భార్య చెల్లిని లోబరుచుకునేందుకు యత్నించిన అలంపూర్ ఎస్సైపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆయనను మహబుబ్‌నగర్ వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలి భర్త అయిన కానిస్టేబుల్ ఇటీవల జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాను తప్పించుకునేందుకు సదరు కానిస్టేబుల్ భార్య అక్క సాయంతో చెల్లెలిను మీడియా ఎదుట హుటాహుటిని పిలిపించి తప్పుడు ఆరోపణలు చేయించినట్లుగా ఉన్నతాధికారులు గుర్తించారు. అంతకుముందు కోడేరు పోలీస్ స్టేషన్‌లో ఉన్న తన బ్యాచ్‌మెట్ స్టేషన్ అధికారికి కానిస్టేబుల్ భార్యతోనే తప్పుడు ఫిర్యాదు ఇప్పించి భర్తపైనే కేసు నమోదు చేయించాడన్న ఆరోపణలు ఈ ఎస్సై ఉన్నాయి. ఈ విషయంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఎస్సై బాగోతాన్ని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో చర్యల్లో భాగంగా వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కేటీదొడ్డి ఎస్సై బదిలీ

కేటీదొడ్డి ఎస్సై శ్రీనివాసరావును జిల్లా పోలీస్ కార్యాలయం డీసీఆర్బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో డీసీఆర్‌బీలో ఉన్న బీ. శ్రీనివాసులును కేటీదొడ్డి ఎస్సైగా బాధ్యతలు అప్పగిస్తూ శనివారం రాత్రి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

- జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రతినిధులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 1: జిల్లా క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయికి ఎదగాలని అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర సూచించారు. మెదక్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో టోర్నీలో పురుషుల విభాగంలో డి.నవీన్ స్వర్ణ పతకం, దీపక్, లింగం కాంస్య పతకం, మహిళ విభాగంలో పూజ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువలేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్నారని గుర్తుచేశారు. నిరంతర సాధనతో క్రీడల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజేందర్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్, కోచ్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్, సెప్టెంబరు 1: మండలంలోని మణికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో 2012-13 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయినాథ్, బాలనారాయణ, రహెమాన్ సైదుద్దీన్, శ్రీదేవి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

- హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ


సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 1 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడం సరికాదని, ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని షాలిమార్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి మిల్లీ మహాజ్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మాని హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మల్లురవి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ వక్ఫ్ చట్టం క్రూరమైనదని, రాజ్యాంగంపై దాడి అని అభివర్ణించారు. ఆర్టికల్ 14, 15, 25లను ఈ బిల్లు ఉల్లంఘిస్తున్నదని, వివక్షాపూరితమైదనదని విమర్శించారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, రైతుల ఇబ్బందులు ప్రధాని మోదీకి పట్టవన్నారు. చైనా మన భూభాగాన్ని ఆక్రమి ంచుకుంటుంటే చర్యలు తీసుకోవటం లేదని విమర్శించారు. ఉత్తర ప్రదేశ్‌లోని కాశీ విశ్వనాథ్ బోర్డుతో పాటు ఇతర దేవాల యాల బోర్డులో కేవలం హిందులకు మాత్రమే చోటు ఉంటుందని గుర్తుచేశారు. కానీ వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు ఎలా చోటు కల్పిస్తారని ప్రశ్నించారు. మత రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, అప్పటిదాకా పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును రాహుల్‌గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి పార్లమెంట్‌లో వ్యతిరేకించినట్లు గుర్తుచేశారు. బిల్లును అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఎంపీ అసదుద్దీన్ ఒక సబెక్టుపై పార్లమెంటులో మాట్లాడితే 545 మంది పార్లమెంటు సభ్యులు, స్పీకర్ సైతం శ్రద్ధగా వింటారని మల్లురవి గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాత వక్ఫ్ చట్టాన్ని మార్చడం సరికాదని, అదే చట్టాన్ని అమలు చేయాలన్నారు. దేవాలయాల కమిటీల్లో హిందువులు, క్రిస్టియన్ కమిటీల్లో క్రైస్తవులు మాత్రమే ఉంటారని, వక్ఫ్ బోర్డులో ఇతర మతస్తులను చోటు కల్పించేలా సవరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మౌలానా జీయావుద్దీన్ నక్షబంది, సయ్యద్ రజాక్‌షా ఖాద్రీ, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ ఖాజాఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, జాబేర్‌బిన్ సయీద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌హాదీ, కోకన్వీనర్లు మిర్జాఖుద్దుస్‌బేగ్, హఫీజ్‌ఇద్రీస్ పాల్గొన్నారు.

పీయూ పరీక్షలు వాయిదా

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబర్ 01: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీయూ అనుబంధంగా ఉన్న పీజీ, డిగ్రీ విద్యార్థుల అన్ని రకాల పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఆదివారం ప్రకటనలో తెలిపారు. తదుపరి పరీక్షల తేదీలలో ఎలాంటి మార్పు ఉండదని, వాయిదా వేసిన పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వాకిటి ప్రత్యేక పూజలు

మక్తల్, సెప్టెంబరు 1 : స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందరర్భంగా 1.130కేజీల వెండితో తయారుచేసిన గంగాధర జలాభిషేకం పాత్రను అర్చకుడు తిప్పయ్యస్వామికి వితరణ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చారకొండ, సెప్టెంబరు 1: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రానికి చెందిన కొండపల్లి కృష్ణయ్య (33) డ్రిల్లింగ్ పనులు చేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. కృష్ణయ్య భార్య బోనాల పండుగకు పుట్టింటికి వెళ్లింది. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కృష్ణయ్య గత నెల 30న తన గుడిసెలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టు పక్కనవారు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

వాసవి వారోత్సవాలు ప్రారంభం

పాలమూరు, సెప్టెంబరు 01: వాసవి వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రాఘవేందర్ ప్రకటించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వాసవి వారోత్సవాల సందర్భంగా రక్తదానం చేశారు. 2న కళాశాలల్లో రక్తదానం, 3న వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల సందర్శన, 4న బాలికలకు ఉపాధి శిక్షణ. 5న ఉపాధ్యాయులకు, 6న జర్నలిస్టులకు, 7న శ్రేయోలాభిలాషులకు సన్మానం చేపడుతున్నట్లు వివరించారు.

మన్ననూరు చెక్‌పోస్టు బంద్


అడవిలోని రహదారిపై నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు


చెక్‌పోస్టు వద్ద ఆందోళన చేస్తున్న పర్యాటకులు

- శ్రీశైలం వెళ్లేందుకు భారీగా నిలిచిన వాహనాలు

మన్ననూర్, సెప్టెంబరు 1 : నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం ప్రాజెక్టు ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడడటం, రహదారిపై చెట్టు కూలడంతో అటవీశాఖ అధికారులు మన్ననూరు చెక్‌పోస్టును ఆదివారం పూర్తిగా మూసివేశారు. ఓ వైపు శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను తెరవడం, ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రమాదాల నివారణలో భాగంగా శ్రీశైలం వెళ్లేందుకు అనుమతి నిరాకరించడంతో చెక్‌పోస్టు నుంచి నిరంజన్ షావలి దర్గా వరకు 3 కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. మద్దిమడుగు, అచ్చంపేట వైపు రాకపోకలు సాగించే వారికి తీవ్ర అసౌకర్యం కలిగింది. సాయంత్రం చెక్‌పోస్టు వద్ద శ్రీశైలం వెళ్లే పర్యాటకులు తమ వాహనాలను అనుమతించాలని ఆందోళనకు దిగారు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను వదలకుండా అడ్డుపడ్డారు. విషయం తెలుసుకుని చెక్‌పోస్టు వద్దకు చేరుకున్న అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

సీపీఎస్ రద్దు చేయకుంటే పోరాటం


తెలంగాణ చౌరస్తాలో నిరసనలో టీజీఈజేఏసీ నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 1: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయకుంటే పోరాటం చేస్తామని రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ (టీజీఈ జేఏసీ) నాయకులు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆదివారం పెన్షన్ విద్రోహదినం సందర్భంగా నిరసన చేపట్టారు. నల్లదుస్తులు, నల్లబ్యాడ్జీలు ధరించి పెద్దఎత్తున పాల్గొన్నారు. స్టీరింగ్ కమిటీ నాయకులు రాజీవ్‌రెడ్డి, చంద్రానాయక్ పలువురు మాట్లాడారు. పెన్షన్ ప్రభుత్వ ఉద్యోగుల హక్కుని, సీపీఎస్ పేరు మార్చి యూపీఎస్‌తో కేంద్ర ప్రభుత్వం కొత్త మోసానికి తెరలేపిందన్నారు. ఇది ఏమాత్రం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదన్నారు. సీపీఎస్ వల్ల 2004 తర్వాత నియామకమైన ఉద్యోగులు పెన్షన్ రాక తీవ్ర మనోవేదనలో ఉన్నారన్నారు. వెంటనే ఆత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రఘురాంరెడ్డి, రవికుమార్, కిష్టయ్య, వెంకటేష్, జుర్రునారాయణ, బాలశంకర్, శ్రీరాములు, నరేందర్, రామకృష్ణ, చంద్రకాంత్, ఉమాదేవి, జయంతి, దివ్య ప్రియాంక, శైలజ, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు తెగిన బ్రాంచ్ కెనాల్

- జంగమాయపల్లి ఎస్సీ కాలనీలోకి వరద నీరు


మూసివేసిన వనపర్తి-పెద్దమందడి మెయిన్ రహదారి

పెద్దమందడి, సెప్టెంబరు 1: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వరద నీరు కెనాల్‌లోకి రావడం పెద్దమందడి, ఘణపూర్ మెయిన్ కెనాల్ జంగమాయపల్లి దగ్గర తెగిపోయింది. కెనాల్ తెగిపోవడం వచ్చిన వరద నీరు అంత ఈర్లచెరువులోకి వెళ్లగా పక్కనే ఉన్న ఎస్సీ కాలనీ వరద నీటిలో మునిగిపోయింది. మండల కేంద్రంలో పలు కాలనీలోకి పెద్ద చెరువు వరద నీరు వచ్చి చేరింది. పెద్దమందడి పెద్ద చెరువు, మద్దిగట్ల మహమ్మద్ హుసన్ చెరువు, అమ్మపల్లి అమ్మ చెరువు, పామిరెడ్డిపల్లి బసిరెడ్డి చెరువు, జంగమాయపల్లి ఈర్ల చెరువులతో పాటు పలు చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. చిన్నమందడి, అల్వాల గ్రామాల మధ్య భారీ వృక్షాలు కూలడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అల్వాల పెద్దమందడి రహదారిలో ఉన్న కల్వర్టుపైకి భారీగా వరద నీరు రావడంతో పోలీసులు రాకపోకలు బంద్‌చేయించారు. జగత్‌పల్లి వాగు పొంగి వనపర్తి జిల్లా కేంద్రం నుంచి పెద్దమందడి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపైకి రావడంతో రహదారిని ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో బంద్ చేయించారు.

'చిన్నోనిపల్లి' మునుగుతోంది..

- కాపాడాలని గ్రామస్థుల ఆవేదన
- గ్రామాన్ని సందర్శించిన పోలీసులు
- పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న మహిళలు
- నీటిలో మునిగిన ట్రాన్స్‌ఫార్మర్, తెగిన విద్యుత్ వైర్లు


మహిళలకు సర్ది చెబుతున్న ఎస్ఐ మల్లేష్


వర్షాలకు భయపడి చెట్టుకిందకు చేరిన చిన్నోనిపల్లి వాసులు

గట్టు, సెప్టెంబరు 1 : భారీ వర్షాలతో రిజయర్వార్‌లోని నీరు గ్రామ సమీపంలోకి వచ్చాయని, తమను ఆదుకోవాలని చిన్నోనిపల్లి ముంపు గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. నీరు గ్రామంలోకి వస్తుండటంతో ఎస్ఐ కేటీ మల్లేష్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రస్తుత వర్షాలతో ఏ క్షణమైనా నీరు గ్రామంలోకి రావొచ్చని తాము ఏమి చేయాలో తోచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులుగా అధికారులు వచ్చి రిజర్వాయర్‌లోని నీటిని దిగువకు వదిలేందుకు డైవర్షన్ కాల్వ తవ్వారని, నీరు మాత్రం ఈ కాల్వ ద్వారా దిగువకు వెళ్లడం లేదని తెలిపారు. ఇప్పటికే గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ నీటిలో మునిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. విద్యుత్ తీగలు తెగడంతో చీకటిలో మగ్గాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రామంలోకి నిత్యం విషపురుగులు తాకిడితో పాటు దోమల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఎస్ఐతో చెప్పారు. సాయంత్రమైతే ఇళ్ల నుంచి బయటకు రాలేని దుర్భర పరిస్థితి నెలకొంది.

పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న మహిళలు

గ్రామం చుట్టూ ఉన్న నీటి పరిస్థితిని పరిశీలించిన అనంతరం పోలీసులు మాట్లాడి తిరిగి వెళ్తుండగా పలువురు మహిళలు అడ్డుగా నిలబడ్డారు. తాము కష్టాల్లో ఉంటే చూసి వెళ్లిపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. దీంతో ఎస్ఐ వాహనం దిగి వచ్చి మహిళలకు సర్ది చెప్పారు. మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో వారు శాంతించారు.

స్తంభించిన జనజీవనం

ఆదివారం కూడా జిల్లాను వర్షం చుట్టుముట్టింది. ఎటు చూసినా జడివానతో జనజీవనం స్తంభించిపోయింది. వాగులు, వంకలతో పాటు చెరువులు నిండి అలుగు పారాయి. కొన్నిప్రాంతాల్లో వరద నీటిలో ప్రజలు చిక్కుకుపోయారు. వీరిని కాపాడేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. కొన్నిచోట్ల ఇళ్లు పడిపోగా, మరికొన్ని చోట్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న గువ్వలోనిపల్లి గ్రామ చెరువు

ఉధృతంగా దుందుభీ, చంద్రసాగర్

అచ్చంపేట/ఉప్పునుంతల, సెప్టెంబరు 1: గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో నియోజకవర్గంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో శనివారమే ఉమామహేశ్వరుని దర్శనం నిలిపివేయగా, శ్రీశైలం మార్గంలోని ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగిపడుతుడటంతో శ్రీశైలం వెళ్లే భక్తులను మన్ననూర్ చెక్‌పోస్టు వద్దనుంచి ఆపి తిరిగి పంపిస్తున్నారు. నియోజకవర్గంలోని దుందుభీ, చంద్రసాగర్ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మొల్గర, ఉల్పర వద్ద వాహనాలను నిలిపివేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయి. అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ప్రజలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, ఆదివారం దేవదారికుంటతండా సమీపంలోని పెద్ద చెరువుకు వెళ్లే వరద ఉప్పునుంతల-అచ్చంపేట రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్నది. వాహనాల రాకపోకలు చేయకూడదని ఎస్సై లెనిన్ హెచ్చరించారు. అదేవిధంగా, శనివారం రాత్రి ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నీట మునిగింది. మరో రెండు మూడు రోజులు వరద కొనసాగితే పంట పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



కొండనాగులలో కూలిపోయిన పురాతన ఇల్లు



చారకొండ మండలం జూపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు



అలుగు పారుతున్న దాసుపల్లి చెరువు

రహదారులపై అడ్డంగా పడిన చెట్టు

బల్మూరు: మండల పరిధిలోని కొండనాగుల గ్రామం నుంచి అచ్చంపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై మహాపెద్దచెట్టు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం తెల్లవారుజామున ఈ చెట్టు పడిపోవడంతో అచ్చంపేట నుంచి కొండనాగుల, బల్మూరు, లింగాల మండలంలో తిరిగే ఆర్టీసీ బస్సులు తిరగకుండా బంద్ అయ్యాయి. ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే మండలంలోని కొండనాగుల, గోదల్, బల్మూరు, తుమ్మన్‌పేట, జినుకుంటతోపాటు తదితరగ్రామాల్లో నాటి పురాతన మట్టితో కట్టుకున్న ఇళ్లు ఉండడం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వ అధికారులకు కోరుతున్నారు.

వర్షాలకు కూలిన ఇండ్లు

చారకొండ: గత మూడు రోజులుగా ఎడతెర పి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో మం డల కేంద్రానికి చెందిన గౌస్ మట్టి ఇళ్లు, మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన అంకిళ్ల మైసమ్మ, అంకిళ్ల రాములమ్మ, జంతుక బాలస్వామిలకు చెందిన ఇళ్లు వర్షానికి దెబ్బతిని కూలిపోయాయి. అప్రమత్తమైన వారు ఇళ్లనుంచి సురక్షిత నివాసాలకు వెళ్లారు. ఆదివారం ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, ఎంపీవో వెంకటేష్‌లు కూలిన ఇళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరూ నివాసం ఉండకూడదని అన్నారు. సురక్షిత నివాసాల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. జూపల్లిలో ఆర్ఐలు రామకృష్ణలు పర్యటించి కూలిన ఇళ్లను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న పది ఇళ్లను గుర్తించి వారిని సురక్షిత నివాసాలకు వెళ్లాలని సూచించారు. కూలిన ఇళ్ల వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపించినట్లు ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ తెలిపారు.



జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ప్రహరీ కూలిపోవడంతో ప్రవహిస్తున్న వరద నీరు

● **అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి**

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అత్యవసర పరిస్థితులలో తప్ప అనవసరంగా బయటి రాకుడదని ఎస్ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. ఎవరికైన ఇబ్బందులుంటే 100కు లేదా సెల్‌నెం: 8712657758 ను సంప్రదించాలని కోరారు.

ఇళ్లు నేలమట్టం

తెలకపల్లి: మండలంలో భారీ వర్షాల వల్ల జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల మండలంలోని అన్ని చెరువులు అలుగు పారుతున్నాయి. దాసుపల్లి చెరువు, తెలకపల్లి పెద్ద చెరువులతో పాటు అలుగులు వెళ్తున్నాయి. మండల పరిధిలోని గౌరారంలో ఎల్లయ్య, మల్లయ్యల ఇరువురి వ్యక్తుల ఇళ్లు కూలిపోయాయి. వీరితో పాటు చిన్నముద్దునూర్‌లో కాశన్నకు చెందిన ఇల్లు కూడా కూలిపోయింది. మండల కేంద్రం నుంచి వెళ్లే రహదారిలో శివగంగ ఫంక్షన్ హాల్ సమీపంలో పెద్ద వేప వృక్షం రోడ్డుపై విరిగిపడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీంతో సంబంధిత అధికారులు ఎస్ఐ నరేష్ తదితరులు రోడ్డుపైన పడిన చెట్టును ఎక్స్‌కవేటర్‌ల సహాయంతో తొలగించి రాకపోకలకు వీలు కల్పించారు. రాకొండలో ఇళ్ల మధ్యలో ఇళ్లలోకి నీరు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అలుగుపారుతున్న చెరువులు

● తిమ్మాజిపేట: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాలకు ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. తిమ్మాజిపేటలో మేకల యాదయ్య, మహమ్మద్ మోహియోద్దీన్, శ్రీశైలం, పార్వతమ్మ, శివయ్య, కాంతమ్మలకుచెందిన ఇళ్లే కాకుండా గుమ్మకొండలో నీలమ్మ ప్రభాకర్‌రెడ్డి కోడుపర్తి గ్రామంలో సురేందర్‌రెడ్డిలకు చెందిన ఇళ్లు ధ్వంసం కావడం జరిగిందని తహసీల్దార్ జేకే.మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మండలంలో అలుగుపారుతున్న పలు చెరువులను పరిశీలించి ప్రజలకు పలు సూచనలు, సలహాలు చేశారు. నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐబీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నేరేళ్లపల్లిలో అలుగుపారుతున్న చెరువును పరిశీలించి ప్రజలకు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌బహదూర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవులు, లక్ష్మీనారాయణ, తదితరులు అలుగుపారుతున్న చెరువును కట్టపై పగుళ్లు రావడానికి పరిశీలించి అధికారులకు వివరించారు.

రోడ్లపై వరద

● పెంట్లవెల్లి: గత మూడు రోజు లుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, కాలువలు పొంగి పొ ర్లుతున్నాయి. ఎటు చూసినా నీటి ప్రవాహం కనిపిస్తున్నది. మంచాలకట్టకు మాధవస్వా మినగర్ వెళ్లే దారి లో వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. అదే విధం గా కాలువలు ఎత్తి పారటంతో వ్యవసాయ పొలాలలో ఎటు చూసినా నీళ్లే ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. పాత ఇళ్లలో ఉండ కుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని తహసిల్దార్ ప్రభాకర్ తెలిపారు.

పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

● కొల్లాపూర్: కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో గల చెరువులు, నిండుకుండలా మారాయి. చెరువులు నిండి అలుగులపై నుంచి వర్షపు నీరు ప్రవహించడం ద్వారా పలు ప్రదేశాలలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా చౌటబెట్ల వెళ్లే దారిలో ఎస్టీ హాస్టల్ దగ్గర, పెంట్లవెల్లికి వెళ్లే దారిలో, చుక్కాయిపల్లి వెళ్లే దారిలో చెరువులు నిండి రోడ్లపై నీరు ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతాలు పరిశీలించి మునిసిపల్ సిబ్బందితో బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. కొంతమంది సెల్ఫీల కోసం వీడియోల కోసం బైక్ రైడ్‌లు చేస్తున్నారు. అలాంటి వారు ఈ విన్యాసాలు చేయడం మానుకోవాలని తెలిపారు. కౌన్సిలర్లు షేక్ రహీంపాషా, మేకల శిరీష, స్థానిక ఎస్ఐ హృషికేష్, కాంగ్రెస్ నాయకులు 17వ వార్డు ఇన్‌చార్జి నరసింహ, తాహేర్, విష్ణు యాదవ్, జహీర్, అంజద్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలు

కొల్లాపూర్ మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 240 ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అదే విధంగా పెంట్లవెల్లి మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి 100 ఎకరాలలో వరి పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేయడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ పేర్కొన్నారు. రైతుల పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజే స్తామని ఆయన వెల్లడించారు.

ఎస్టీ హాస్టల్ పరిశీలన

భారీగా కురుస్తున్న వర్షాలకు చౌటబెట్ల వెళ్లే దారిలో గల ఎస్టీ హాస్టల్‌లోకి వరద నీరు చేరింది. సమాచారం తెలుసుకున్న మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య, కౌన్సిలర్లు షేక్ రహీంపాష , మేకల శిరీష కిరణ్ ఎస్టీ హాస్టల్‌ను పరిశీలించారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులను తక్షణమే పక్కనే ఉన్న ఎస్సీ హాస్టల్‌లోకి మార్చాలని హాస్టల్ వార్డెన్‌కు తెలిపారు.



మంచాలకట్ట గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపై పొంగిపొర్లుతున్న వాగు



కొల్లాపూర్ ఎస్టీ హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ రమ్య

నిండు కుండలా మారిన చెరువులు

మన్ననూర్: రెండు రోజులుగా నల్లమల ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు అమ్రాబాద్ మండలం మన్ననూరు దుర్వాసుల చెరువు, చింతల చెరువు, ధర్మసముద్రం, మాచారం చెరువులన్నీ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకొని నిండు కుండల్లాగా మారాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి నల్లమలలోని పిచ్చకుంట్లోని చెరువు నుంచి గుండ వాగు ద్వారా నీరు ప్రవహించి దుర్వాసుల చెరువులోకి చేరుకుంది. దుర్వాసుల చెరువు నిండి అలుగు పారుతూ ఉండడంతో మిగతా గొలుసు కట్టు చెరువుల్లోకి నీరు చేరుతోంది. చెరువుల్లో వలలు వేసి చేపలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంక శాఖ అధికారులు తెలిపారు.



నీటితో నిండిన మన్ననూరు దుర్వాసుల చెరువు

ఉధృతంగా దుందుభీ వాగు

వంగూరు: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో మండలంలోని డిండిచింతపల్లి వద్ద దుందుభీ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ ఒడ్డు ఆ ఒడ్డు నిండా పరుచుకొని బ్రిడ్జిని తాకేలా ఎగువ నుంచి వస్తున్న వరద నీరు దిగువకు డిండిప్రాజెక్టులోకి ప్రవహిస్తున్నది. అదే విధంగా ఉల్పర వద్ద కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద ఉధృతికి పలు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

వంగూరు మండలంలోని జాజాలలో వర్షపు నీరు ఇంట్లోకి చేరడంతో నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామచంద్రమ్మకు చెందిన మట్టి మట్టిమిద్దెలోకి వర్షపు నీరు చేరింది. దీంతో మట్టి మిద్దె ప్రమాదభరితంగా మారింది. ఇంటి వెనక భాగంలో ఉన్న బావిబొంద నిండి ఆ నీరు ఇంటిలోకి వస్తుందని, మట్టి మిద్దె ఇప్పుడు కూలే విధంగా ఉందని వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకొని మేలు చేయాలని రామచంద్రమ్మ కోరుతోంది.



జాజాలలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

అలుగులు పారిన చెరువులు, కుంటలు

అమ్రాబాద్: అమ్రాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 11 మట్టి మిద్దెలు కూలిపోయాయి. గత రెండు రోజులుగా భారీ వర్షం పడి శిథిలావస్థలో ఉన్న మట్టిమిద్దెలు కూలడంతో ఆహార పదార్థాలతో పాటు ఇళ్లలోని వస్తువులు దెబ్బ తినడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి మొత్తం నిర్విరామంగా వర్షం పడటంతో మండల పరిధిలోని వంగరోనిపల్లి, తెలుగుపల్లి గ్రామాల్లో 11 మంది ఇళ్లు కూలిన బాధితులు తమకు ఫిర్యాదు చేసినట్లు అమ్రాబాద్ ఇన్‌చార్జి తాహసీల్దార్ రావూఫ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వివిధ గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు నిండి అలుగు పారాయి.

మండల పరిధిలోని కుమ్మరోనిపల్లి సమీపంలోని కొత్త చెరువు అలుగు పారడంతో అచ్చంపేట- మద్దిమడుగు ప్రధాన రహదారిపై కొంత సేపు వాహనాలు రెండు వైపులా నిలిచిపోయాయి. వరదల కారణంగా ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు ఇరువైపులా పోలీస్ రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

కూలిన మట్టి మిద్దె

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో తుఫాన్ తాకిడికి మట్టి మిద్దె ఆదివారం కూలింది. జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో జమా మస్జీద్ ప్రాంతంలోని సాదత్‌స్ట్రీట్‌లో ఉన్న ఖలీల్ రహమాన్ మట్టి మిద్దె వర్షం తాకిడికి కూలింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా వేరే రూమ్‌లో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబిద్‌అలీలు సంఘటన స్థలాన్నిక పరిశీలించి పంచనామా నిర్వహించారు.

రాకపోకలకు తీవ్ర అంతరాయం

కందనూలు: తుఫాన్ ప్రభావంతో తీవ్ర వర్షాభావానికి మండలంలోని పలు గ్రామాల్లో రాకపోకలకు ఆదివారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని మంతటి గ్రామానికి సమీపంలో ఉన్న వాగు దగ్గర రోడ్డుపై నీరు పారడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. గగ్గలపల్లి, నాగర్‌కర్నూల్ మార్గమధ్యలో రోడ్డుపై నీరు రావడంతో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి వెళ్లే వాహనదారులకు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు ఆ రోడ్డు మార్గాన్ని నిలిపివేస్తూ ట్రాఫిక్‌ను జిల్లా కేంద్రంలోని ట్యాంక్‌బండ్ ఎండబెట్ల మీదుగా కల్వకుర్తికి దారి మళ్లించారు. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల నుంచి తాడూరు మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి మార్గమధ్యలో కేసరి సముద్రంపై ఉన్న బ్రిడ్జిపై నీరు రావడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ సమీపంలోని సుఖజీవన్‌రెడ్డి ఫంక్షన్ హాల్ ముందు ప్రధాన రహదారిపై వర్షపు నీరు రావడంతో వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాయంత్రాంగం అత్యవసర పనులుంటే తప్ప బయటకురావద్దని సూచించారు. ఆదివారం సెలవు దినంకావడంతో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో అత్యవసర పనులు ప్రజలు మాత్రమే బయటకొచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నాగర్‌కర్నూల్‌లోని ప్రధాన రహదారిపై పారుతున్న వర్షపు నీరు

కుండపోతకు నీట మునిగిన పంటలు

బిజినేపల్లి: ముసురు వర్షాలకు ఆదివారం మండలంలోని మంగనూర్, వట్టెం, ఖానాపూర్, గంగారం, శాయిన్‌పల్లి తదితర గ్రామాల్లో ఏడు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తహసీల్దారు శ్రీరాములు తెలిపారు. ఎంపీడీవో, ఎస్ఐలతో ప్రత్యేక బృందంగా ఏర్పాటై ఆయా గ్రామాల్లోని అధికారులను అప్రమత్తం చేస్తు ప్రజలకు అందుబాటులో ఉండి ఏచిన్న సమస్య తలెత్తినా వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మండలంలో పరిస్థితులను డీపీవో రాంమోహన్ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి తహసీల్దారు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించి తెలుసుకున్నారు. లట్టుపల్లి గ్రామ సమీపంలో కేఎల్ఐ కాలువ తెగిపోవడంతో నీళ్లు పొలాల్లోకి వెళ్ళి దాదాపు 300 ఎకరాల్లో పంట కొట్టుకపోయినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో వాగులు, వంకలు ఉప్పొంగి పారుతుండంతో వేల ఎకరాల వరి, పత్తి పంటలు నీట మునిగి అపార నష్టం మిగిల్చింది.



బిజినేపల్లి మండలం ఖానాపూర్‌లో అలుగు పారుతున్న పెద్ద చెరువు

నిండిన వాగులు, పిల్ల కాల్వలు

కల్వకుర్తి: కురుస్తున్న వర్షాలతో వాగులు, పిల్ల కాల్వలు పొంగి పొర్లుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. కల్వకుర్తి మండలం తర్నికల్ సమీపంలో కల్వర్టుపై వర్షం నీటి ప్రవాహాన్ని ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కల్వకుర్తి మండలం తర్నికల్ సమీపంలోని రహదారిపై కాల్వ పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి సీఐ బి.నాగార్జున, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వాహనాల రాకపోకలు నిలిపివేయించి కల్వర్టు కింద తాత్కాలిక ఏర్పాటు చేసిన రోడ్డును ఎక్స్‌కవేటర్ సహాయంతో ఐదు గంటలు కష్టపడి సీఐ దగ్గరుండి తొలగించేలా చేశారు. దీంతో సాయంత్రం వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. అదేవిధంగా యంగంపల్లి రోడ్డు కల్వర్టు వద్ద పారుతున్న వర్షపు నీటితో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో తహసీల్దార్ ఇబ్రహీం సంఘటన స్థలానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షాల వల్ల కల్వకుర్తి మండలంలోని యంగంపల్లి, తాండ్ర, తర్నికల్ గ్రామాల్లో ఒక్కొక్క ఇల్లు కూలిపోగా కల్వకుర్తి పట్టణంలో రెండు పాత ఇల్లు కూలిపోయినట్లు కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం తెలిపారు.

గొర్రెల కాపరులను కాపాడినందుకు సత్కారం



మాదారం శివారులో నుంచి డ్రోన్ కెమెరాను పంపిస్తున్న ఎస్సై వీరబాబు, తహసీల్దార్ చెన్నకిష్టన్న, మాదారం యువకులు

ఊర్కొండ, సెప్టెంబరు 1: ఊర్కొండ మండలం మాదారం-తాడూర్ మండలం సిరసవాడ మధ్య గల దుందుభీ నది ప్రవహిస్తుండటం వల్ల మధ్యలో చిక్కుకున్న గొర్రె కాపారులను కాపాడటంలో ప్రధాన భూమిక వహించిన ఎస్సై వీరబాబు, తహసీల్దార్ చెన్నకిష్టన్నకు మండల ప్రజలు అభినందించారు. సిరసవాడ-మాధారం గ్రామాల మధ్య ప్రవాహిస్తున్న దుందుభీ వాగులో చిక్కుకున్న వారిని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు మాధారం శివారులో నుంచి యువకుల సహాయంతో డ్రోన్ కెమెరాల ద్వారా గొర్రెల కాపరులను గుర్తించామని అన్నారు. డ్రోన్ కెమెరాలు పంపించిన దగ్గరి నుంచి వారు ఉన్న ప్రాంతం నాలుగు వందల మీటర్ల దూరంలో గుర్తించి వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేశామని పేర్కొన్నారు. మూడు గంటల పాటు కృషి చేసి గుర్తించడంతో మాధారం యువకులకు, ఎస్సై వీరబాబు, తహసీల్దార్ చెన్నకిష్టన్న, పోలీసు సిబ్బందిని గ్రామస్థులు అభినందించి, శాలువాలతో సత్కరించారు.

పెద్దవాగు దాటకుండా చర్యలు

కొల్లాపూర్, సెప్టెంబరు 1: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలను కొల్లాపూర్ మండలంలో ముక్కిడిగుండానికి సంబంధించిన పెద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం పెద్ద వాగును పరిశీలించి ప్రజలు అటువైపు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా రాళ్లను ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు ఇచ్చారు. నార్లాపూర్, ముక్కిడిగుండం గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం ఉంటేనే గ్రామాలను దాటలని పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాల ప్రజల పరిస్థితిని పరిశీలించి వారికి సూచనలు చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు. అదే విధంగా మండలంలోని పురాతన నివాస గృహాలలో ఎవరు నివసించొద్దని కూలిపోయే నివాస గృహాల వారికి కొల్లాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లాపూర్, సెప్టెంబరు 1: వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న నివాస గృహాలలో ఎవరు ఉండొద్దని భారీ వర్షాల కారణంగా కావలోని కుంట చెరువకు సమీపంలో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ షేక్ రహీంపాషా కోరారు. తుఫాను ప్రభావం వలన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదివారం మునిసిపల్ పరిధిలోని 10 వార్డులోని కావలోనికుంట చెరువుకు వరద ఉధృతి పెరిగి చెరువు నిండింది. చెరువు లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్ల సమీపంలోకి వరద నీరు చేరింది. ఆ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలను కౌన్సిలర్ కలిసి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారి కుటుంబాలను ఆయన పరిశీలించి, మునిసిపల్ చైర్ పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి మునిసిపల్ శానిటరీ సిబ్బంది సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

ఊర్కొండ: వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలను ఎంపీడీవో కృష్ణయ్య సందర్శించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో పాత ఇంట్లో ఉన్న కుటుంబానికి పాఠశాల భవనంలోకి ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు. వారికి కావాల్సిన నిత్యావసర వస్తువులు అందించారు. ఊర్కొండపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఠాకూర్ తండాలో రమావత్ జంకు అనే ఒంటరి మహిళ ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో అధికారులు సందర్శించి పలు సూచనలు చేస్తూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా జగబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం ఇల్లు భారీ వర్షాల కారణంగా కూలిపోయింది. బాల్యలొక్య తండా శివారులో తిరుపతి నాయక్ రైతు రెండు రోజుల క్రితం నాటిన వరి నాటు భారీ వర్షాల కారాణంగా కొట్టుకుపోయింది. గ్రామాల్లో పర్యటించిన అధికారులు ఎస్సై వీరబాబు, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 1: రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్ చేశారు. ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణంలో సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ప్రతినిధి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోద యోగ్యం కాని వివిధ రూపాల్లో పెన్షన్ విధానాన్ని తీసుకురావడం సరైంది కాదన్నారు. ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు కోరుకుంటుంది కేవలం పాత పెన్షన్ విధానమే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, సరేందర్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళి, కొత్త శ్రీధర్‌రావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.కృష్ణ, శ్రీధర్‌శర్మ, డీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు రామస్వామి, లక్ష్మణ్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు షర్ఫుద్దీన్, సంజీవ్, జేఏసీ జిల్లా నాయకులు శ్రీనివాసులు, సురేష్, గోవర్దన్, కళ్యాణ్, రాజు, ఈశ్వర్, మధుసూదన్‌రెడ్డి, కొంగరి రమేష్, వహీద్‌ఖాన్, అమరేందర్‌రెడ్డి, ఈశ్వర్, శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, నరసింహ వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి'

వెల్దండ, సెప్టంబరు 1 : మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో రెండువందలకు మించి సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, జంగయ్యయాదవ్, బాలస్వామి, శ్రీనివాసాచారి, వెంకటయ్య, జంగయ్యయాదవ్, శశిదర్‌రెడ్డి, శ్రీశైలంఉన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పాఠశాలలకు కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జనానికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి జాగ్రత్తలు జిల్లా యంత్రాంగం చేపట్టిందని ప్రజలు కూడా ఇందుకు సహకరించాలని ఆయన కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించిన ఆయన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మునిసిపల్ సిబ్బంది అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కొట్ర వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు

వెల్దండ, సెప్టంబరు 1 : భారీ వర్షాల నేపథ్యంలో శ్రీశైలం వెళ్లే రహదారిలో కొండచరియలు విరిగిపడి రహదారి ప్రమాధభరితంగా మారడంతో ఉన్నతాధికారుల సూచనమేరకు మండలపరిధిలోని కొట్ర చౌరస్తావద్ద హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై వెల్దండ పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ప్రతినిత్యం వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ఈ రహదారి వెంట శ్రీశైలం వెళుతుంటారు. ఈ క్రమంలో ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు శ్రీశైలం వెళ్లే ప్రయాణికులను చెక్‌పోస్టువద్ద ఆపి హెచ్చరిస్తూ వెనక్కిపంపుతున్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ: కేసు నమోదు

ఉప్పునుంతల, సెప్టెంబరు 1 : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని మెకానిక్ సైదయ్య షాపు ముందు ఉంచిన ఆరు విద్యుత్ మోటార్లు శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించిన్నట్లు ఎస్సై తెలిపారు. వాటి విలువ 1లక్ష రూపాయిల వరకు ఉంటుదన్నారు. సైదయ్య ఫిర్యాదు మేరకు ఆదివారం ఎస్సై లెనిన్ కేసు నమోదు చేసిన్నట్లు ఆయన తెలిపారు.